

వి.ఎస్ మృతి ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పూర్వ పొలిట్‌బ్యూరో సభ్యులు వి.ఎస్ అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజలకు తీరని లోటు అని సిపిఎం జిల్లా కమిటీ పేర్కొంది. వి.ఎస్ మృతికి సంతాపంగా పార్టీ కార్యాలయంపై జెండాను అవతనం చేసి ఆయనకు నివాళ్లర్పించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకునిగా అనేక పోరాటాల్లో కీలక వ్యక్తిగా వ్యవహరించారని తెలిపారు. 17 ఏళ్లకే కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరారని చెప్పారు. కార్మిక, కర్షక ఉద్యమాలు నిర్మించారని, తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన మహా యోధుడు అని కొనియాడారు.

కార్మికుల పొట్ట కొడితే సహించం



సంఘీభావం తెలియజేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

- ఐఎంఎల్ డిపో విడదీయొద్దు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి, అధిక మొత్తంలో ప్రజా ధనాన్ని అద్దె రూపంలో చెల్లించి కొత్తగా టెక్కలిలో పెడుతున్నారని వామపక్షాల నాయకులు తెలిపారు. ఎపిఎస్‌బిసిఎల్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయొద్దని, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని, మూడు తరాలుగా డిపోలో పనిచేస్తున్న హమాలీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ గతంలో యూనియన్ నాయకులు మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి వినతిపత్రం ఇచ్చినప్పుడు టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయకుండా కృషి చేస్తానని హామీనిచ్చి, ఇప్పుడు టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. టెక్కలిలో కొత్తగా డిపో పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని, పెట్టాలని ఎవరు కోరారని ప్రశ్నించారు. జిల్లా ప్రజలు శివారు భూములకు నీరు కావాలని అడుగుతున్నారు తప్ప కొత్తగా డిపోలు పెట్టి బీరు అడగడం లేదన్నారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో వంద మంది దళిత కుటుంబాలకు చెందిన నాలుగు ఎకరాల భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని ఎచ్చెర్లలో యారక్ బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాలను కార్మికులు, హమాలీలుగా ఉపాధి కల్పించిందని తెలిపారు. అప్పటి ప్రభుత్వ సారా తయారీ నుంచి ఇప్పుడు ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐఎంఎల్ డిపోగా నడుస్తున్న దీనిపై 350 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపోగా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి, కొత్తగా మరో డిపో ఏర్పాటు ఏర్పాటు అవసరం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల గోడౌన్‌కు ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని నెలకు రూ.లక్షల్లో ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వ గోడౌన్ ఉండగా, అధిక మొత్తంలో అద్దెని చెల్లించి ప్రైవేటు గోడౌన్ టెక్కలిలో ఎందుకు పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఐఎంఎల్ డిపో కోసం కార్మిక కుటుంబాలు కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని ఉచితంగా త్యాగం చేసి ఇచ్చారని, ఇప్పుడు డిపో తరలిపోవడం వల్ల కార్మిక కుటుంబాలు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన భూములు ప్రభుత్వానికి ఇస్తే, ఈరోజు వారికి ఉపాధి లేకుండా చేస్తుందా అని ప్రశ్నించారు. హమాలీలు ఒంటరిగా లేరని జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు వారి వెన్నంటి ఉన్నారని చెప్పారు. వారి పోరాటానికి వామపక్షాలు అండగా ఉంటాయని భరోసానిచ్చారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ దళితులు, పేదలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డిపోను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న వామపక్షాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టర్‌కు మహా రాయబారం నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి, శ్రీకాకుళం పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.గోవర్ధనరావు, ఎపిఎంఎస్ఆర్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్.మహేశ్వరరావు, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు కొత్తకోట అప్పారావు, సిఐటియు పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్ తదితరులు కార్మికుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. సమావేశంలో ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు ఎన్.రమణ, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సభ్యులు

కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

జాతీయ మానిటరింగ్ బృందం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన జాతీయ స్థాయి మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) బృంద సభ్యులు సునీల్ బంటా, నాథుసింగ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. ఉపాధి హామీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ, పిఎం గ్రామ సడక్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్, సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన తదితర పథకాల అమలు స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో పారదర్శకత, సమగ్రత అవసరమని పేర్కొన్నారు. బృందం క్షేత్ర స్థాయి సందర్శనల ద్వారా పథకాల అమలుపై నేరుగా అంచనా వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు తమ రికార్డులు, డేటా, అమలుపై సమాచారం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజల వద్దకు పథకాల లబ్ధి పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెనుకబడిన తరగతులకు ఇళ్లు, రహదారి, పౌర సౌకర్యాలు వంటి అవసరాలను గుర్తించి వేగంగా నెర వేర్చాలని సూచించారు. అభివృద్ధి, డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డుల ఆధునికీకరణ, ఇంటర్-కనెక్టివిటీ వంటి అంశాల్లో వేగవంతమైన పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్‌రాజా, డిఆర్‌డిఎ పి.కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీకె.అప్పారావు, పిఆర్‌జి ఎస్ఇ రవి, వ్యవసాయశాఖాధికారి త్రినాథస్వామి, డిపిఒ సౌజన్య, ఆర్ఎస్ఇటిఐ డైరెక్టర్ ఎన్.రాంజీ, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

నేటి నుంచి పర్యటన

ఎన్ఎల్ఎం బృందం జిల్లాలోని వివిధ మండలాల్లో మంగళవారం నుంచి పర్యటిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 22న ఉదయం సంతబొమ్మాళి మండలంలోని బోరుభద్ర, మధ్యాహ్నం అదే మండలంలో ఉమిలాడ, 23న ఉదయం అదే మండలం తాళ్లవలస, 24న ఉదయం కొత్తూరు, మధ్యాహ్నం నేరడి, 25న ఉదయం అదే మండలం నివగాం, 26న శ్రీకాకుళం మండలంలోని రాగోలు, మధ్యాహ్నం సిలగాం సింగివలస పంచాయతీలను సందర్శిస్తారని తెలిపారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అన్ని పనులకు కలిపి ఒకే యాప్ తీసుకురావాలని సిఐటియు ఆఫీస్ బేరర్ ఎం.ఆదినారాయణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం శ్రీకాకుళం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలపై తీవ్రమైన పనిభారం మోపుతుందని, రకరకాల యాప్‌ల పేరుతో వేధిస్తోందని విమర్శించారు. ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్ తీసుకొచ్చి లబ్ధిదారులకు ఆహారం ఒటిపి ద్వారా ఇకెవైసి చేసి ఫొటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా లబ్ధిదారులతో సంతకం పెట్టించుకొని సరుకులు ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న సరుకులు పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్ ద్వారానే ఇవ్వాలని నిర్ణయించడం సబబుకాదన్నారు. బియ్యం, పప్పు ఆయిల్, గుడ్లు కిట్లు వంటి సరుకులన్నీ ఒక్కసారిగా రావడం లేదని, వీటిని ఇచ్చేటప్పుడు అంగన్వాడీ వర్కర్ ఫొటోతో పాటు, లబ్ధిదారులకు ఫోటోలు తీసి మాత్రమే ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. లబ్ధిదారులు సరుకులు తీసుకోవడానికి వచ్చినప్పుడు ఫోన్లు పనిచేయక పోవడం, నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్లు పని చేయకపోవడంతో వారు విసిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు 2022లో ఫోన్ ఇచ్చారు. 90శాతం ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదన్నారు. యాప్ నిర్వహణకు కావాల్సిన నెట్ స్పీడ్ ఇవ్వలేదని, ఎటువంటి ట్రైనింగ్ లేదని చెప్పారు. గ్రామాల్లో మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అసలు సిగ్నలే ఉండటం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ, మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరగాలని అధికారులు పెట్టే ఒత్తిడితో ప్రీస్కూల్ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఎఫ్.ఆర్.ఎస్ రద్దు చేయాలని, ప్రీస్కూల్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.రాజేశ్వరి, కె.జ్యోతి, జి.రాజేశ్వరి, అంజలి బాయ్, పద్మజ, డి.ముత్యాలమ్మ, ఆదిలక్ష్మి, సూర్యకుమారి, నిర్మలమ్మ, ఎన్.పార్వతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం: ఫేస్ యాప్ రద్దు చేయాలని, అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.అప్పమ్మ, బి.స్వాతి, పి.నాగమణి, ఆర్.రేవతి, జి.ధనలక్ష్మి, గిరిజ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులు సేవలు పొందుటకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్వాడీ జిల్లా సహాయ కార్యదర్శి పంచాది లతాదేవి, ప్రాజెక్టు కార్యదర్శి పి.భూలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సునీత, అమ్మాయమ్మ, భారతి, నాగమణి, లక్ష్మి, శశికళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

బూర్జ: అంగన్వాడీలకు వేతనాలను పెంచాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిజేశ్వరరావు డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రాధిక, సిహెచ్ అన్నపూర్ణ, వై.బండారమ్మ, ఎం.లక్ష్మితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్‌యాప్ రద్దుచేయాలని, సెంటర్ నిర్వహణకు ఒక్కయాప్ మాత్రమే నిర్వహించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి డి.పాపినాయుడుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులుపి.రాములమ్మ, జి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: తొలగించిన అంగన్వాడీ కార్యకర్తల్ని విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేతనం అమలు చేయాలని జిల్లా అంగన్వాడీ వర్కర్స్, హెల్పెర్స్ ప్రధాన కార్యదర్శి డి.సుధ డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్ల కమిటీ సభ్యులు ఎల్.దుర్గ, జయలక్ష్మి, లక్ష్మి, చామంతి, స్వర్ణలత, ఉషారాణి, ఎస్.సరోజని పాల్గొన్నారు.

పలాస: సరైన సెల్ ఫోన్లు, నెట్ సౌకర్యం కల్పించకుండా రకరకాల యాప్‌లు పెట్టి పనిచేయమనడం ఎంతవరకు సబబని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మంజుల, బి.సునీత ఆవేదన వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నాలు చేపట్టారు. అనంతరం ప్రాజెక్టు అధికారి పార్వతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.సునీత, ఆర్.భవాని, బి.నిర్మల, జి.నారాయణి, యు.దానమ్మ, ఆర్.అరుణ, పి.గన్నెమ్మ, పి.కళ్యాణి పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన అంగన్వాడీలు ఆదిలక్ష్మి, వాణిశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు హైమ, బాలామణి, జయ, ఉమ, సుహాసిని పాల్గొన్నారు.

కొత్తూరు : ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి. హేమలత, ఎస్.అనురాధ, కె.లక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, జలజాక్షి, నీరజ, లక్ష్మి, శ్రీలత, బొడమ్మ, విజయ, అమ్మాయమ్మ, సిఐటియు .నాయకులు సిర్ల ప్రసాద్, పి.కృష్ణ పాల్గొన్నారు.


నరసన్నపేట: ఫేస్ రికాగ్నైజ్ యాప్ రద్దు చేయాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం పిఒ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.సురేష్‌బాబు, అల్లు సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

చీకటి కావడమే ఆలస్యం... వేకువజాము వరకూ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. నిబంధనలు మట్టిలో తొక్కి మరీ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. మండలంలోని ఎస్ఎన్ పురం పెద్ద చెరువులో సర్వే నంబరు 19లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు లేకపోయినా నాలుగు రోజులుగా మట్టిని తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలకు చేపట్టేటప్పుడు ఏ సర్వే నంబర్లలో ఎంత తవ్వకాలు చేపడుతున్నామనే విషయాలను పేర్కొంటూ రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు తీసుకోవాలి. ఇందుకు సంబంధించి రాయల్టీని చెల్లించాలి.

ఇవేవీ లేకుండానే స్థానిక నాయకుల కనుసన్నల్లో అక్రమ రవాణా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు రాత్రి వేళ అతి వేగంతో ట్రాక్టర్లు వెళ్తుండడంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై తహశీల్దార్ బి.గోపాలరావు వివరణ కోరగా, మట్టి తవ్వకాలకు ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. చెరువును పరిశీలించి మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రాత్రి సమయంలో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయి



ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

'మీకోసం'లో వైసిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆమదలవలస నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త చింతాడ రవికుమార్, పొందూరు మండలం దల్లిపేట సర్పంచ్ కంబాపు నీలవేణి ఫిర్యాదు చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికార పార్టీనాయకుల వద్ద యూరియా ఉంచుకుంటున్నారని, రైతు సేవా కేంద్రాల్లో ఎరువు ఉండటం లేదని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

132 మంది తల్లికి వందనం రాలేదు...

ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 132 మంది విద్యార్థులకు వర్తించలేదని తల్లులు ఫిర్యాదు చేశారు. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, హెచ్ఎం, ఎంఇఒ దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పరిష్కారం లభించలేదని సమస్య కలెక్టర్‌కు వివరించారు. ఆధార్ నమోదులో లోపం ఉందని చెబుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ పథకానికి సంబంధించి పలువురు మహిళలు, ఇతరులు విద్యుత్ మీటర్లు తమ ఆధార్‌కు అనుసంధానం కావటం, తప్పుడు విద్యుత్ రీడింగ్, విద్యా హక్కు చట్టంలో ఉచిత విద్య పొందుతున్నట్లు చూపిస్తున్నాయని బాధితులు చెప్పారు. విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

భూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు...

తాతతండ్రుల నుంచి సాగు చేస్తున్న సర్వే నంబరు 295, 297లో 4.90 ఎకరాలు డీపట్టా భూమిని కొందరు అక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులుతో కూడిన పలాస మండలం పెంటభద్ర రైతులు ఫిర్యాదు చేశారు. సవర రవీంద్ర, భాస్కరరావు, సండయ్య, గోపాలు, మహేష్‌బాబు, కామాక్షి తమ సమస్య కలెక్టర్‌కు చెప్పుకున్నారు. వంశపారంపర్యంగా వస్తున్న భూమి పోడి పద్ధతిలో జీడి మామిడి సాగు చేస్తూ జీవిస్తున్నామని అన్నారు. రెవెన్యూ అధికారుల ద్వారా సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు.

కలెక్టర్ సమీక్ష

అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్జీదారు సంతృప్తి చెందేలా సమాధానం ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలు పరిష్కారమైతే పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారణ చేసి అర్జీదారులకు సమాచారం అందించాలన్నారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, తదితర శాఖల సమస్యలపై 80 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అర్జీదారులు సంతృప్తి పొందేలా ప్రజా ఫిర్యాదులు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి వినతులు స్వీకరించారు. 56 మంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణం తెలియజేసి సమీక్షించారు. ప్రతి ఫిర్యాదుకు నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. అర్జీలను చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని, ప్రజా ఫిర్యాదులపై అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. వృద్ధులు, వికలాంగుల అర్జీ దారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.



ధర్నా చేస్తున్న గిరిజనులు

గిరిజనుల ధర్నా

కొత్తూరు: ప్రభుత్వం తక్షణమే గిరిజన ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల బిల్లులను చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. మండల హౌసింగ్ కార్యాలయం వద్ద గిరిజనులు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం హౌసింగ్ ఎఇ ఎం.మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల బిల్లులు పెండింగ్ ఉండడంతో లబ్ధిదారులు అర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పువ్వాత్తి, పి.జమున, సింహాచలం, గంగారావు, రాజయ్య, సింహాద్రి పాల్గొన్నారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పోలాకి: ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులకు పోలాకి పిహెచ్‌సి నేత్ర వైద్యులు సాంబమూర్తి సోమవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 150 మంది విద్యార్థులను తనిఖీలు నిర్వహించారు. ఇందులో 15 మందికి కళ్లద్దాలు అవసరం కాగా, వారికి ఉచితంగా అందచేశారు. అనంతరం నేత్రాలకు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల ధర్నా



ఆమదాలవలస : నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ:

ప్రభుత్వం మొండివైఖరి విడనాడి, మున్సిపల్ కార్మికుల (ఇంజనీరింగ్, పారిశుధ్య) సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 6వ రోజు సమ్మె కొనసాగింది. మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా సోమవారం మున్సిపల్ కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సమ్మెకాలపు ఒప్పందాలు, జిఒలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులకు జిఒ 36 ప్రకారం రూ.26 వేలు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేయాలని, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు ఎ.శంకర్, డి.యుగంధర్, ఎ.శేఖర్, ఎ.మోహన్, గణేష్, ఎన్.తిరుమల, పి.మల్లమ్మ, ఎ.జ్యోతి, ఎ.గణేష్, ఆర్.శేఖర్, ఎ.రాము, దేవి, వెంకట లక్ష్మి, డి.లక్ష్మి, కె.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు అందరిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు తాడి సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మోణింగి వారి వీధిలో నున్న మస్టర్ పాయింట్ వద్ద ఐదోరోజు విధులకు హాజరు కాకుండా నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, కోశాధికారి జె.శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, కె.ధనలక్ష్మి, ఎన్.రమ, కె. ఈశ్వరరావు, కె.నీలమ్మ, ఎ.శ్రీనివాస్, డి.రాజేష్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు



శ్రీకాకుళం సిటీ : నిరసన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ పట్నాయక్, గంగాధర్ రతో, మంగలసత్తు, ఢిల్లి తదితరులు పాల్గొన్నారు.

పలాస : మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, కె.వెంకట్, ఎం.రవి, ఎస్.శంకర్, ఎస్.రమేష్, ఎస్.భాస్కరరావు, కూర్మారావు, బాలకృష్ణ, ప్రకాష్ ముఖి, గులాబి, పార్వతి, నాని శకుంతల పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని గొనకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న కొరుకోల గణపతిరావు (45) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి టెక్కలి మండలం తొలిసూరిపల్లి స్వగ్రామంలోని ఇంటి వద్ద ఒక్కసారిగా ఛాతిలో నొప్పి ఎక్కువగా రావడంతో కుప్పకూలిపోయాడు. ఉపాధ్యాయుడి మృతిపై ప్రధానోపాధ్యాయులు తెరుకోటి కృష్ణారావు, ఉపాధ్యాయులు, సర్పంచ్, పాఠశాల చైర్మన్ సోమవారం పాఠశాల వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గణపతిరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



పనులను పరిశీలిస్తున్న దిలీప్‌కుమార్

బోరు ప్లాట్‌ఫారం నిర్మాణం

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో 21 వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ తన సొంత నిధులు వెచ్చించి బోరు ప్లాట్‌ఫారానికి సోమవారం నిర్మించారు. దీంతో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించినందుకు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 21 వార్డులో బాసు దేవ క్వర్టర్స్ వద్ద మరమ్మతులకు నోచుకోక ఖాళీగా ఉన్న బోరు దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. దీంతో మున్సిపల్ యంత్రాంగం బోర్ మెటీరియల్ ఏర్పాటు చేసింది. వార్డు కౌన్సిలర్ దగ్గర ఉండి బోర మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్లాట్‌ఫారం నిర్మాణానికి అవసరమైన డబ్బులు వెచ్చించారు.



పద్మకు నియామకపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

విధుల్లో చేరిన అంగన్వాడీ కార్యకర్త

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పెద్ద మతలబుపేట అంగన్వాడీ కార్యకర్త ఎట్టకేలకు సోమవారం తిరిగి విధుల్లో చేరారు. గత వైసిపి హయాంలో అంగన్వాడీ కార్యకర్త నూక పద్మపై టిడిపి సానుభూతిపరురాలిగా ముద్రవేసి విధుల నుంచి అప్పటి పాలకులు తొలగించారు. అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో ఎటువంటి తప్పు చేయని పద్మ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. సుమారు ఆరేళ్ల పాటు విధులకు దూరంగా ఉన్న ఆమెకు న్యాయస్థానం శనివారం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. సోమవారం ఆమె విధుల్లో చేరుతూ ఆనందంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి కార్యదర్శి నూక కోటేశ్వరరావు, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు నూక ప్రభాకరరావు, టిడిపి నాయకులు బగాది ధనుంజయరావు, పైడితవుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నాగావళి నది తీర పరివాహక ప్రాంతమైన నిమ్మతొర్లాడ వద్ద నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు తవ్వకాలు నిబంధనలు మేరకు చేపట్టాలని ఆర్‌డిఒ సాయి ప్రత్యూష ర్యాంపు నిర్వాహకులకు ఆదేశించారు. శనివారం అర్ధరాత్రి ఇసుక ర్యాంపు నిర్వాహకులకు గ్రామస్తుల మధ్య జరిగిన వివాదంపై ఆమె ఆదివారం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పొన్నాడ సుధాకర్‌తో కలిసి విచారణ చేపట్టారు. ముందుగా గ్రామస్తులను ఆర్‌డిఒ విచారించగా నాగావళి నది పరివాహ ప్రాంతంలో పూర్వం నుంచి తమ గ్రామస్తులకు స్మశాన వాటిక, పశువుల మేత ప్రదేశం, యువకులు క్రీడలకు ఉపయోగించే ప్రదేశాలు ఉన్నాయని ఆమెకు తెలిపారు. అయితే ప్రస్తుతం ఇసుకర్యాంపు నిర్వహిస్తున్న నిర్వాహకులు ఈ మూడు ప్రదేశాల మధ్యలో కొత్తగా వాహనాల రాకపోకలకు రహదారి ఏర్పాటు చేయడం వలన ఈ మైదాన ప్రాంతం అంతా కోతకు గురవుతుందని గ్రామస్తులందరం తెలిపామని గ్రామస్తులు ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఈ మూడు ప్రదేశాలను విడిచిపెట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టాలని ఆర్‌డిఒ నిర్వాహకులకు సూచించారు. అంతేకాకుండా ఇసుక లారీల రాకపోకలకు ఏర్పాటుచేసిన రహదారికి తక్షణమే అనుమతులు తీసుకోవాలని లేనియెడల చర్యలు తప్పవని ఆర్‌డిఒ ఇసుక ర్యాంపు నిర్వాహకులకు హెచ్చరించారు.



గ్రామస్తులను విచారిస్తున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

పోలీస్ పహారాలో ఇసుక ర్యాంపు

మండలంలోని నిమ్మతొర్లాడ ఇసుక ర్యాంపు వద్ద గ్రామస్తులకు ర్యాంపు నిర్వాహకులకు మధ్య జరిగిన వివాదం దృష్ట్యా ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి జరిగిన వివాదంతో ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సనపల బాలరాజు సిబ్బందితో కలిసి ఇసుక ర్యాంపు ప్రదేశంలో పహారా ఏర్పాటు చేశారు.



పరీక్షిస్తున్న వైద్యులు

కిడ్నీ వ్యాధిపై అవగాహన తప్పనిసరి

కవిటి: ఉద్దానం ప్రాంతంలో ప్రతి ఒక్కరికీ కచ్చితంగా కిడ్నీ వ్యాధిపై అవగాహన ఉండాలని, అదే సమయంలో ఆందోళన చెందకూడదని మాణిక్యపురం, కంచిలి పిహెచ్‌సి వైద్యులు భాస్కరరావు, నాగేంద్ర, ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని బార్లపుట్టుగ, యలమంచిపుట్టుగ, తలగానపుట్టుగ గ్రామాల పరిధిలోని ప్రజలకు అందుబాటులో సోమవారం కిడ్నీ వ్యాధిపై బార్లపుట్టుగలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారుగా 239 మందికిపైగా నమూనాలు సేకరించి సలహాలు, సూచనలు చేస్తూ అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ఈ శిబిరంలో గతంలో వ్యాధి ఉన్నవారికి తప్పించి కొత్తవారి నమూనాలు సక్రమంగా ఉన్నట్టు తెలిపారు. ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకుంటూ తగు శారీరక జాగ్రత్తలు పాటిస్తే కిడ్నీ వ్యాధి సమస్య ఉండదని అన్నారు. వీలైనంతవరకు ప్రతిఒక్కరూ ప్రతి మూడు నెలలకు కానీ ఆరు నెలలకు కానీ ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం అవసరమని సూచించారు. ఈ శిబిరంలో కంచిలి, బొరివంక, ఎంఎస్ పల్లి పిహెచ్‌సిల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తులసీదాస్‌రెడ్డి

విగ్రహం ఏర్పాటు

ఇచ్ఛాపురం : అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారు మృతి చెందడంతో ఆయనపై ఉన్న ప్రేమతో తండ్రి తిప్పణ రమణ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసి సోమవారం ఆవిష్కరించారు. కుమారుడి ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, కొండ శంకర్‌రెడ్డి, తిప్పన భాస్కర్‌రెడ్డి, బర్ల ప్రకాష్‌రెడ్డి, లోపింటి తారకేసిరెడ్డి, తిప్పన కూర్మారెడ్డి, శిల్లా మేఘనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

ఆమదాలవలస: ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను రక్షిద్దామని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి కె.ప్రసన్న రాణి అన్నారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహహింస, అత్యాచారాలు, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భాస్కరరావు, వై.పుష్పలత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ యూనిట్ ప్రారంభం

టెక్కలి : మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కౌట్ యూనిట్‌ని ప్రధానోపాధ్యాయులు ఆర్.యమున సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వారిలో దేశభక్తి, సామాజిక స్పృహని చాటిచెప్పే విధంగా ఉండేందుకు స్కౌట్ వినియోగంలోకి వస్తుందన్నారు. ఆరు నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను భాగస్వామ్యం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారావు, రామారావు, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్ సందర్శన

కొత్తూరు : స్థానిక చిల్డ్రన్ హోమ్‌ను జిల్లా న్యాయవాధికార సంస్థ కార్యదర్శి, సబ్ జడ్జి కె.హరిబాబు సోమవారం సందర్శించారు. ఇందులో పిల్లల యోగక్షేమలను, వారికి కావాల్సిన అవసరాలు, పరిసరాలు, భోజన వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ప్రిన్సిపాల్ రోస్లిన్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ

ఎచ్చెర్ల: స్థానిక కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా సోమవారం జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సహకారంతో హృదయ శ్వాస కోసం పునర్జీవన చర్య ఎలా చేయాలో విద్యార్థులకు శిక్షణ అందించారు. అత్యవసర సమయంలో మనిషికి సిపిఆర్ చేసి శ్వాసను ఎలా అందించాలో, దానివలన కలిగే ఉపయోగాలను జెసిఐ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది వివరించారు. కళాశాల డీన్ కె.మోషే ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు సిపిఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది అవగాహన పొందారు.

దుస్తుల పంపిణీ

నరసన్నపేట : ఎస్‌సిసిటి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన పడాల ట్రస్టు నిర్వాహణలో సోమవారం నరసన్నపేట కళ్యాణ మండపంలో దుస్తులు, పౌష్టికాహారం పంపిణీ ప్రోగ్రాం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు పాఠశాల నుంచి 53 మంది విద్యార్థులఉ రెండు జతలు దుస్తులు, బెల్లం, నువ్వు ఉండలు, చెక్కీలు, ఖర్జూరం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ టి.వి.సాయికిరణ్, ట్రజరర్ రజినీకాంత్, సభ్యులు టి.రవీంద్రనాథ్, రామకృష్ణంరాజు, శ్రీనివాస్, ఎంఇఒ దాలినాయుడు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

- పౌరసరఫరాల గోదాం తూనిక తేడాపై పరిశీలన
- తూనిక యంత్రం మరమ్మతులకు గురవ్వడంపై అనుమానం



పరిశీలిస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ చిన్నమ్మ, తహశీల్దార్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పౌరసరఫరాల గోదాం వద్ద రేషన్ డిపోలకు వెళ్తున్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల తూనికల్లో మోసంతో భారీగా నష్టపోతున్న డీలర్లు గత మూడేళ్లుగా ఇదే పరిస్థితితో ప్రతినెలా రెండు నుంచి మూడు క్వింటాలు నష్టం భరిస్తున్నారు. గోదాం వద్దనే సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్, వాచ్‌మేన్లు అవకతవకలకు పాల్పడుతున్నారు. ఈనెల 18న మండలంలోని రెండు డిపోలకు సరుకులు వేయగా అనుమానం వచ్చిన డీలర్లు ఓ ప్రైవేటు వేబ్రిడ్జి వద్ద తూకం వేయించగా 280 కిలోల మేర తూకంలో తక్కువ రావడంతో సిబ్బందిని డీలర్లు నిలదీశారు. దీంతో 18న బియ్యం బస్తాల్లో తరుగు అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి జిల్లా అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో సోమవారం జిల్లా తూనికలు, కొలతలు అసిస్టెంట్ కంట్రోలర్ వి.చిన్నమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది గోదాం వద్దకు వచ్చి కాటాను పరిశీలించారు. అప్పటికే అది మరమ్మతులకు గురవ్వడంతో మెకానిక్‌ను రప్పించి చూడగా అది బాగవ్వలేదు. డిస్‌ప్లే పని చేయకపోవడంతో చేసేది లేక మరోసారి యంత్రం మరమ్మతులు అయిన తర్వాత వచ్చి కాటాని పరిశీలిస్తామని చిన్నమ్మ తెలిపారు. ఇంతలో 20 మందికిపైగా రేషన్ డీలర్లు ఇజ్జు సత్తిబాబు, బాడిత హరికృష్ణ, ముప్పిడి రమేష్, యినపకుర్తి అప్పుడు, అప్పలనాయుడు, అప్పలరాజు తదితరులు గోదాం వద్దకు చేరుకొని ప్రతినెలా తమకు తూకంలో తేడాతో భారీగా నష్ట పోతున్నామని తహశీల్దార్ జిఇఎల్ శ్రీనువాసరావు వద్ద ఆవేదన చెందారు. గోదాం సిబ్బందిని ఇద్దరిని మార్చకపోతే తాము నష్టాలతో డిపోలను నడపలేమని వాపోయారు. ఈ సమస్యను ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారిని మార్చేందుకు సంబంధిత అధికారులకు నివేధించడం జరిగిందని తహశీల్దార్ డీలర్లుకు తెలిపారు. అలాగే డిపోలకు సరుకులు తరలింపులో రూట్ మ్యాప్ ప్రకారం వేయాలని ఎంఎల్ఎస్ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌ను గట్టిగా హెచ్చరించి ఆదేశించారు.

కాటా మరమ్మతులపై ఎన్నో అనుమానాలు ?

నిన్నటివరకు బాగా పనిచేసిన తూనిక యంత్రం హఠాత్తుగా సోమవారం నాటికే మరమ్మతులకు గురవ్వడంపై ఎన్నో అనుమానాలకు తావిస్తుందని డీలర్లు పలువురు చర్చించుకున్నారు. గోదాం వద్ద తూకంలో మోసంపై పత్రికల్లో రావడంతో అధికారులు విచారణకు వస్తున్నారని తెలిసి అక్కడి సిబ్బంది తమ బండారం ఎక్కడ బయట పడుతుందోనని దానినుంచి తప్పించు కొనేందుకు కావాలనే తూనిక యంత్రాన్ని పాడు చేసారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ సిబ్బందిని మార్చేతే తప్ప తాము డిపోలను నడపలేమని, వారు మోసాన్ని, అక్రమాన్ని భరించలేమని ఇటీవల ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు డీలర్లు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబు మోసాలపై నిలదీయాలి

కవిటి: మండలంలోని దూగాన పుట్టుగ పంచాయతీ పరిధిలోని బొయిరాగిపుట్టుగలో సోమవారం వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నాలుగో దశలో విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గతంలో ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు అమలు చేయని వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తదేనని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు గుణపాఠం చెప్పేలా కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, సర్పంచ్‌లు నారాయణస్వామి, భద్రాచలం, ఎంపిటిసి దుద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని వైసిపి నాయకులు కోరారు. మండలంలోని జీయన్నపేట, చిన్నసాన, రామేశ్వరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అనే కార్యక్రమంపై ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండని అడిగితే ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఎంపిటిసి తమ నిధులను, విధులను నిర్వహించకుండా ప్రభుత్వం అడ్డుకుందన్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగక పాలన కుంటుపడిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ఈ బెదిరింపులకు, తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సంపతిరావు హేమసుందరరాజు, అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, బోనేల ఎల్లయ్య, బలగ సూర్యారావు, పొన్నాడ మురళీమోహన్, గుంట సోమేశ్వరావు, సింగుపురం వినోద్ పాల్గొన్నారు.



కవిటి : మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

పోలాకి : చంద్రబాబు ప్రజలకు నమ్మించి నిలువునా ముంచాడని పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య విమర్శించారు. మండలంలోని వనితమండలం క్లస్టర్ పరిధిలో తలసముద్రం, జొన్నం, మబగాం గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అన్ని తరగతులను దగా చేసిందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కణతి కృష్ణారావు, వైస్ ఎంపిపి కలగదండి తాతారావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చింతు రాఘవ పాల్గొన్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం

పరిశ్రమల శాఖ మంత్రి వెంకటేష్

రణస్థలం రూరల్: సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మండలంలోని కోష్టలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపక్షాన ఉంటుందని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన పోస్టర్లను పంపిణీ చేశారు. లంక శ్యాం, కూటమి నాయకులు పిషిని జగన్నాథం నాయుడు, పిషిని హరికృష్ణ, పైడి అప్పడుదొర, అసిరినాయుడు, పిన్నింటి భానోజీనాయడు, కలిశెట్టి సూర్యనారాయణ, లంక ప్రభ, ముక్కు ఆదినారాయణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని హుకుంపేటలో ఎమ్మెల్యే గౌతు శిరీషా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పిఎసిఎస్ అధ్యక్షుడు కణితి సురేష్ చౌదరి, నాయకులు పీరుకట్ల విఠల్, మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, వంక రామారావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ కాలనీలో తొలి అడుగు కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, సర్పంచ్‌లు ఎల్. భగవాన్ దాస్ నాయుడు, అప్పారావు, శ్రీరాములు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ సాలిపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పుజారి శైలజ, భాస్కర్, ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గార మండలం అంపోలు పంచాయతీ ఆడవరం, పిలకపేట, అంపోలు, బిసి కాలనీ, ఎస్‌సి కాలనీలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, గొండు వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనునిత్యం అవస్థలే..



గోతులమయమైన చీడివలస నుంచి గుత్తావల్లి వెళ్లే ప్రధాన రహదారి

- ఇసుక లారీలతో ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

భారీ వాహనాలు రాకపోకలతో ఆ గ్రామస్తులకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆ గ్రామస్తుల ప్రజలు ఆరోపిస్తున్నారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం తమరాం గ్రామ సమీపంలో ఉన్న ఇసుక ర్యాంపు, అలాగే బూర్జ మండలంలోని చిన్న లంకాం గ్రామ సమీపంలో ఉన్న ఇసుక రాంపుల నుంచి ప్రతిరోజు రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడ్లతో ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండంతో తాము అవస్థలు ఎదుర్కొంటున్నామని కొల్లివలస, చీడివలస, గంగంపేట, లాబాం, గుత్తావల్లి, నారాయణ పురం, చినలంకాం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రాంపుల నుంచి అధికలోడ్లతో భారీ వాహనాల రాకపోకల వలన ఆయా గ్రామాల్లో రహదారి మొత్తం గోతులమయంగా తయారైందని గ్రామస్తులు వాపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వాహనాలు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటూ ఉన్నామని, లారీలతో దూళి రేగడంతో వృద్దులు, చిన్నారులు దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

గోతుల్లో దిగుతున్న లారీలు

వారం రోజుల్లో పలు దపాలు ఇసుక లారీలు గోతుల్లో దిగబడిన సందర్భాలు ఉన్నాయి. ఇసుక లారీలు గోతుల్లో దిగబడిన సమయంలో ట్రాఫిక్ జామ్ అవ్వడంతో పలు అవస్థలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇసుక లారీలను అడ్డుకున్నామని, ఇసుక వ్యాపారులు లేదా సంబంధిత ప్రభుత్వం స్పష్టమైన హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశామని గ్రామస్తులు తెలిపారు. అయితే ఇంతవరకు ఇసుక వ్యాపారుల నుంచి గాని ప్రభుత్వం నుంచి గాని ఎటువంటి హామీలు రాకపోవడం దురదృష్టకరమని, ముఖ్యంగా ఇదే రహదారిపై పలు ప్రభుత్వ పాఠశాలలు ఉండడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా భయాందోళనకు గురవుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి అధిక ఇసుకలోడుతో రాకపోకల వలన గోతులమయంగా మారిన రహదారిని బాగు చేయాలని, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, అలాగే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్పష్టమైన హామీలను ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పోరాటానికి కూడా సిద్ధమవుతామని తెలిపారు.

ప్రజల అవస్థలు పట్టవా..?



అధికలోడ్లతో లారీల రాకపోకల వలన గ్రామస్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వానికి ప్రజల అవస్థలు పట్టడం లేదు. ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అనారోగ్యాలకు గురవుతున్నాం. అధికారులు చొరవచూపి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

- బొడ్డ మన్మథరావు, చీడివలస

పొంచి ఉన్న ప్రమాదం



లారీల వలన గ్రామాల్లో ప్రమాదం పొంచి ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో గ్రామాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నివారణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.

- పల్లా వీరాస్వామి, చీడివలస


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

జీవ ఎరువులతో భూసారం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

రైతులు తమ పంట భూములకు జీవ ఎరువులు వాడితే భూ సారవంతంగా అవుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో వ్యవసాయ శాఖకు సంబంధించి పచ్చిరొట్ట విశిష్టత, పంటల భీమాకు సంబంధించి పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవమని అన్నారు. పచ్చిరొట్ట వల్ల నేలసారం పెంపుదల అవుతుందని అన్నారు. నేల నిర్మాణం కూడా పటిష్టంగా ఉంటుందన్నారు. జీవన వెలుగులతో పంటలకు బలం చేకూరుతుందన్నారు. నేలలోని పోషకాలను కరిగించి పంటలకు అందిస్తాయన్నారు. రైతులు జీవ ఎరువులు వాడేందుకు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు ఎం.రామారావు, ఎఒలు పోలారావు, బమ్మిడి ధనుంజయ, ఎఇఒ పాపారావు, టిడిపి నాయకులు పి.విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బి.నాగరాజు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్టాఫ్ నర్సులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాధమ్మ కోరారు. స్థానిక సర్వజనాస్పత్రిలో సంఘ జిల్లా అధ్యక్షులు శాంతకుమారి ఆధ్వర్యంలో సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ స్టాఫ్ నర్సులచే నాన్ నర్సింగ్ డ్యూటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పనులు చేయించడం తగదన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంఎన్ఒ, ఎఫ్ఎన్ఒలు పనికి సరిపడనంతగా లేరని తద్వారా నర్సులపై పనిఒత్తిడి పెరిగిపోతుందన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ నర్సులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు, అంతే కాకుండా నైట్ డ్యూటీలు చేసిన నర్సులకు సంవత్సర కాలంగా నైట్ డ్యూటీ అలవెన్సులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. స్టాఫ్‌నర్సులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర సెక్రటరీ కోటమ్మ, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు గంగా భవాని, సెక్రటరీ వరలక్ష్మి, మన్యం జిల్లా అధ్యక్షులు చంద్ర సాయి తదితరులు పాల్గున్నారు.



కొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వైసిపి నాయకులు

నాగభూషణం వర్ధంతి

కొత్తూరు : పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త నాగభూషణం ఐదో వర్ధంతి స్థానిక వెంకటేశ్వర కాంప్లెక్స్ సోమవారం నిర్వహించారు. ముందుగా నాగభూషణం చిత్రపటానికి వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పూలమానులు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, నాయకులు పి.ఎతిరాజు, డి.అప్పన్న, కె.సంతు, ఎస్.హరీష్, పి.అశోక్, రాజాలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి. మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త రెడ్డి నాగభూషణం వర్ధంతి నిర్వహించారు. ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్ ఆధ్వర్యాన నాగభూషణరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, పరపతి యోగి, మాడుగుల మని, రవి, కిరణ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పశువులు, దూడలు ముద్దచర్మ వ్యాధి బారిన పడకుండా పశువైద్య సిబ్బంది సూచనల మేరకు పశువుల యజమానులు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి వారణాసి రమేష్ అన్నారు. సోమవారం పురపాలక సంఘంలోని చింతాడలో పశువులకు నివారణ టీకాలు వేశారు. వర్షా భావం వలన కలిగే గాలులతో వైరస్ కారణంగా ముద్దచర్మ వ్యాధి పశువులకు విస్తృతంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిన్న చిన్న దూడల్లో ఈ వ్యాధి ఎక్కువగా సోకడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి సోకడం వలన చిన్న దూడల్లో రోగ నిరోధక శక్తి తగ్గి మరణాలు కూడా సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోర గోవిందరావు, గోపాలమిత్ర నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : ముద్ద చర్మవ్యాధికి టీకాలు ద్వారా నివారణ జరుగుతుందని సింగుపురం పశువైద్యులు నారాయణమూర్తి అన్నారు. మండలంలోని కిష్టప్పపేటలో పశువులకు లంపి స్కిన్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో గోండు స్వాతి, సర్పంచ్ అరసవల్లి సత్యవతి, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది అర్జున్, అజిత్, మోహన్ పాల్గొన్నారు.

డ్రోన్ యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి- సారవకోట

రైతులను అన్ని విధాలా ఆదుకునేవిధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని వెంకటాపురానికి చెందిన అయ్యప్ప డ్రోన్ గ్రూప్ సభ్యులకు, జలుమూరు మండలం కూర్మనాథపురం రామన్న డ్రోన్ గ్రూప్ సభ్యులకు సబ్సిడీపై రైతులకు అందిస్తున్న డ్రోన్ యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.9.80 లక్షలు విలువైన డ్రోన్ యంత్రం కేవలం తక్కువ ధరకే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. రూ.7.84 లక్షలు రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు.

రైతులు గ్రూపులుగా ఏర్పడి సంఘాన్ని ఏర్పాటు చేసుకోగలిగితే ఈ అవకాశం వారికి లభిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపిపి కూర్మినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, పట్టా ఉమామహేశ్వరరావు, వెలమల రాజేంద్ర నాయుడు, కింజరాపు సత్యనారాయణ, సర్పంచ్‌లు బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచందరరావు, మొయ్యి గోవిందరావు పాల్గొన్నారు.


డ్రోన్ యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న విఎఎలు

ఎమ్మెల్యేను కలిసిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావును మండలానికి బదిలీపై వచ్చిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు సేవలు అందించాలని, సమయ స్ఫూర్తితో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో విహెచ్ఎ ఆర్.సుమాంకా, నిరజా, రేష్మ, ప్రియాంక, సుధ, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎంటిఎస్ (మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిటిఎఫ్ మండల అధ్యక్షులు పైడి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు లేకపోవడంతో రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులందరికీ 62 సంవత్సరాల వరకు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని, 12 నెలల జీతం చెల్లించాలని కోరారు. మండల యూనిట్‌గా తీసుకుని బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో సుదూర ప్రాంతాలకు బదిలై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐచ్ఛిక సెలవులను కూడా వాడుకోలేని దయనీయ స్థితిలో ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు మెట్ట సన్యాసిభట్లు, మండల ప్రధానకార్యదర్శి గణేష్, మండల బాధ్యులు వెంకటరమణ, హిమవంతరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

పిఎసిఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- సారవకోట

పిఎసిఎస్ ఆవరణంలో త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. చైర్మన్‌గా సురవరపు తిరుపతిరావు, డైరెక్టర్లుగా శిమ్మ రామకృష్ణ, సంపతిరావు మురళీధర్‌రావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు విశేషంగా అందించాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ఆరంభం నేపథ్యంలో రైతులకు ఎరువులు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతుల అభ్యున్నతకు ప్రధాన ధ్యేయంగా కృషి చేయాలన్నారు. సొసైటీని మరింత ఆర్థికంగా బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలకు తోడుగా సొసైటీ ద్వారా రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపిపి కూర్మినాయుడు, బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు కత్తెరి వెంకటరమణ, సాధు కృష్ణారావు పొద్దిన రత్నాలనాయుడు, పట్ట ఉమ, చల్ల ఆనంద్, కోన వెంకట్ పాల్గొన్నారు.


సభ్యులతో రమణమూర్తి, వెంకటరమణ


ధర్నా చేస్తున్న బాధితురాలు, తదితరులు

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

ఉమ్మడిగా కొనుగోలు చేసి, ఉమ్మడి ఖాతాలో ఉన్న ఆస్తిని తనకు సంబంధం లేకుండా వారసత్వంగా సంక్రమించిన ఆస్తిగా మార్చి గురువెల్లి పురుషోత్తం తన అల్లుడు బోకర మోహనరావుకు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేయాలని బాధితులు సత్తారు ధనలక్ష్మి కోరారు. టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. చింతలగార రెవెన్యూ గ్రామంలో భాధిత మహిళ సత్తారు ధనలక్ష్మి, ఆమె భావ గురువెల్లి పురుషోత్తం జాయింట్‌గా 63 సెంట్లు ఆస్తిని కొనుగోలు చేశామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉమ్మడి ఆస్తిగా నమోదై ఖాతా నంబరు 196గా ఉందన్నారు. జాయింట్‌గా కొనుగోలు చేసిన ఆస్తిని వాటాలు వేసుకొని, ఆ వాటాలు ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకొని ఆ తరువాత ఎవరి ఆస్తి వారి ఇష్టానుసారం క్రయ, విక్రయాలు చేపట్టారని అన్నారు. ఈ ధర్నాలో సత్తారు వైకుంఠరావు, ఉత్తర జోగి కుమారు, పి.బాలకృష్ణ, కె.చంద్రరావు, డిపోలయ్య, వి.లక్ష్మణరావు, ఎస్.గౌరమ్మ, వేణుగోపాలరావు, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం, నరసమ్మ, గౌరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని, మున్సిపాలిటీ పరిధిలో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సాధారణంగా వరి సాగు విస్తీర్ణం 3130 హెక్టార్లు కాగా, ఈ ఏడాది వంద శాతం నర్సరీ వితరణ పూర్తయింది. ఇకపై వ్యవసాయ కాలప్రమాణాలను అనుసరించి నాట్లు చేపట్టే ప్రక్రియ సాగుతోంది. అదనంగా ప్రత్యక్ష వితరణ ప్రక్రియలో 1.21 హెక్టార్లు, ఇప్పటివరకు నాట్లు పూర్తయిన విస్తీర్ణం 65.56 హెక్టార్లని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ తెలిపారు. జూన్ ఒకటి నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 274 మి.మీగా ఉండాల్సి ఉండగా, వాస్తవ వర్షపాతం 191 మి.మీ మాత్రమే నమోదైంది. 29 శాతం వర్షపాతం లోటు కనిపిస్తోంది. ప్రస్తుతానికి నర్సరీలు సంతృప్తికరంగా పెరిగాయని ఎఒ తెలిపారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా రైతులు నర్సరీల్లో రెండు శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయాలన్నారు. అలాగే ఐరన్ లోపం ఉన్న చోట్ల ఫెరస్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. ఇప్పటికే బుర్జపాడు, బిర్లంగి, తేలుకుంచి గ్రామాల్లో 120 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని అన్నారు. నాట్లు చేసిన వెంటనే కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ... నర్సరీలు, నాట్లు చేసిన పొలాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు.


తేలుకుంచి గ్రామంలో వేసిన వరి నాట్లు

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని నందిగాం వన్ గ్రామ సచివాలయ పరిధిలో టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్ సోమవారం ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతునూ ఆదుకునే విధంగా ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు. మండలానికి 440 మెట్రిక్ టన్నుల యూరియా, 337 మెట్రిక్ టన్నుల డిఎపి, 23 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ, వ్యవసాయ విస్తరణాధికారి ప్రగడ వాసవి, టిడిపి నాయకులు ఎం.బాలకృష్ణ, పి.చంద్రశేఖరరావు, ఎస్.జానకిరామ్, మదన్మోహన్, పి.రవి, పి.చలపతిరావు, ప్రదీప్‌కుమార్ పాణిగ్రహి పాల్గొన్నారు.


నందిగాం : ఎరువులను పంపిణీ చేస్తున్న అజయ్‌కుమార్

టెక్కలి రూరల్ : మండలంలోని భగవాన్‌పురం, పోలవరం, లింగలవలస గ్రామాల్లో రైతుల వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు సోమవారం ఎరువులను పంపిణీ చేశారు. మండలంలో 240 మెట్రిక్ టన్నుల యూరియా, వంద మెట్రిక్ టన్నుల డిఎపి రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రయివేటు వర్తకుల వద్ద కూడా 200 మెట్రిక్ టన్నుల యూరియా, 120 మెట్రిక్ టన్నుల డిఎడిపి, 210 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 60 టన్నుల పొటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండలంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ఎన్.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు శిరీష, ఝూన్సీ, కిషోర్, విక్టర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

రాహుల్‌ని కలిసిన కృపారాణి

టెక్కలి : కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు చెందిన డిసిసిని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో రాహుల్‌ను కలవడంతో రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. స్థానిక రాజకీయ అంశాలపై కొద్ది సేపు మాట్లాడినట్లు తెలిపారు. ఈమెతో పాటు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు ఉన్నారు.


రాహుల్‌తో కృపారాణి


వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

వసతి సదుపాయాలు కల్పించాలని వినతి

టెక్కలి : పట్టణంలో వివిధ కళాశాలల్లో చదువుతున్న దూరప్రాంత విద్యార్థులకు స్థానికంగా ఉన్న వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిరుద్యోగ పోరాట సమితి జిల్లా నాయకులు తలసముద్రం సూర్యం కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్‌డిఒ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు. కొన్ని వసతిగృహాల్లో అదనపు గదులు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


విప్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెజ్జిపుట్టుగలో ఉన్న చక్ర పెరుమాళ్ స్వామి ఆలయ నూతన మండపం నిర్మాణానికి సర్వశ్రేయోనిధి(సిజిఎఫ్) నిధులు రూ.28 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావుతో పాటు గ్రామస్తులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ తరుపున చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో గొండ్యాల రామమూర్తి, బార్ల జగన్నాథం, బార్ల ధనుంజయం, బొడ్డ మోహనరావు,, పూడి వెంకటేశం, బొర్రా నరసింహమూర్తి, పొందల ధనుంజయం పాల్గొన్నారు.


సోంపేట : మాట్లాడుతున్న భవనీశంకర్

అంకితభావంతో పనిచేయాలి

సోంపేట : అంకితభావంతో నిరంతరం సేవలు అందించాలని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్ తమ సిబ్బందికి పిలుపునిచారు. ఇటీవల బదిలీపై మండలంలో వివిధ రైతు సేవా కేంద్రాల్లో విధుల్లో చేరిన 13 మంది వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో నాణ్యమైన సేవలు అందించేందుకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: గ్రామ సర్వేయర్లు రైతులకు అందుబాటులో ఉండి భూ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ సత్యనారాయణ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిటి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.